క్లుప్తంగా

శ్వేత పత్రం విడుదల చేయాలి



శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నరసింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజక అభివృద్ధికి ఎమ్మెల్యే అబ్రహం ఏం చేశారో చెప్పాలన్నారు. జోగుళాంబ సాక్షిగా సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి రూ.100 ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అలంపూర్ చౌరస్తాలో ఫైర్‌స్టేషన్, మినీ బస్‌డిపో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి మరిచారని విమర్శించారు. ఇప్పటికైనా నియోజక వర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

రూ.5లక్షలు విరాళం



గద్వాల రూరల్: రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భరోస కేంద్రానికి విశ్రాంత హిందీ పండిట్ బుచ్చన్న రూ.5లక్షలను విరాళంగా అందజేశారు. గతంలో రూ.10 లక్షలను ప్రధానమంత్రి సహాయనిధికి ఇచ్చి అందరి మన్ననలు పొందారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించే సమయంలో ఎంతో మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించిన బుచ్చన్న రిటైర్‌మెంట్ తరువాత కూడా సమాజం కోసం తన వంతు కృషి చేయడం అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆదివారం గద్వాల పట్టణంలో బుచ్చన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రతాప్, ఆంజనేయులు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందండి

అయిజ: ఆస్తిపన్ను, నల్లా బిల్లులు చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ కల్పించిందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు

గట్టు: మండల పరిధిలోని పెంచికలపాడులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగి విద్యుత్ తీగలు కాలాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒకే చోట ఏర్పాటు చేశారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో విద్యుత్ తీగలు కాలాయి. దీంతో గ్రామంలోని వివిధ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకుని కాలిన విద్యుత్ వైర్లను సరిచేసి, గ్రామానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే ట్రాన్స్‌ఫార్మర్ మాత్రం కనెక్షన్ తొలగించడంతో పొలాలకు కరెంట్ సరఫరా లేక ఇబ్బంది పడుతున్నట్లు రైతులు తెలిపారు.

ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయం



ధరూరు: ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని పాస్టర్ నరేష్ పాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో మట్టల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు మార్లబీడు గ్రామాల్లో ఈత మట్టలను చేత పట్టుకుని ర్యాలీ తీశారు. గుడ్‌ఫ్రైడేకి ముందు ఏసుక్రీస్తు జీవితాన్ని స్మరించుకుంటూ మట్టల కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పెబ్బేరు రూరల్: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ దాడి యోగానందరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు ఆయన అందజేశారు.

శిథిలావస్థలో చెక్‌డ్యాంలు

- 2009 లో కొట్టుకుపోయిన సైడ్‌వాల్స్
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అయిజ పెద్దవాగులో శిథిలమైన చెక్‌డ్యాం

అయిజ: భూగర్భ జలాలు పెంచేందుకు, వర్షపు నీరును ఒడిసిపట్టుకునేందుకు వాగులు, వంకల్లో 2001లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చెక్ డ్యాంలను నిర్మించింది. ఒక్కొక్క చెక్‌డ్యాంకు రూ. 5 లక్షల నిధులతో నిర్మాణాలు చేపట్టారు. 2009లో వచ్చిన వరదల కారణంగా అలంపూర్ నియోజకవర్గంలోని చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు వాటిని పునర్ నిర్మించలేదు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. అయిజ శివారులో మొత్తం 4 చెక్‌డ్యాంలు ఉండగా వాటిలో రెండు శిథిలమయ్యాయి. అదేవిధంగా మానవపాడు మండలంలోని కలుకుంట్ల, మానవపాడు, కొరివిపాడు, జల్లాపూర్, పల్లెపాడు, చందూర్, చిన్న పోతులపాడు, గోకులపాడు, బొరవెల్లి, పెద్ద పోతులపాడు గ్రామ శివార్లలో కలిపి మొత్తం 13 చెక్‌డ్యాంలు నిర్మించారు. వాటిలో రెండు శిథిలమయ్యాయి. ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం– సాతర్ల గ్రామాల మధ్య చెక్ డ్యాం నిర్మించారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. కొత్తగా వల్లూరు సమీపంలో మరొక చెక్‌డ్యాం మంజూరు కాగా వడ్డేపల్లి మండలంలోని బుడమర్సులో రెండు చెక్‌డ్యాంలు ఏర్పాటు చేశారు. బుడమర్సులో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. మండలంలో కొత్త చెక్‌డ్యాంలకు మంజూరు రాలేదు.

నీరు నిలువడం లేదు..

చెక్‌డ్యాంలు నిర్మించినప్పటినుంచి కొన్ని సంవత్సరాలపాటు అలంపూర్ నియోజకవర్గంలోని వాగుల్లో వర్షాకాలం సంవృద్ధిగా నీరు నిలిచి చుట్టుపక్కల భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో తాగునీరు, సాగునీరు సంవృద్ధిగా లభించింది. మూగజీవాల దాహం తీర్చేందుకు ఇవి ఉపయోగపడ్డాయి. ఈ సంతోషం కొన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. 2009లో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లాయి. దీంతో చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ తెగిపోయి కట్టడాలు శిథిలమయ్యాయి. వాటికి మరమ్మతు చేపట్టకపోవడంతో అప్పటినుంచి ఇప్పటివరకు వాగుల్లో నీరు నిలువని పరిస్థితి నెలకొంది. కనీసం పశువులు దాహం తీర్చేందుకు కూడా నీరు నిలువ ఉండటం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శిథిలమైన చెక్‌డ్యాంలకు మరమ్మతు చేయించాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నా ఫలితం లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు. పాలకవర్గం స్పందించి చెక్‌డ్యాంలన్నింటికి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. అదేవిధంగా నూతనంగా మంజూరైన వాటిని వెంటనే నిర్మించి, మరొకొన్ని చెక్‌డ్యాంలు నిర్మించేందుకు కృషిచేయాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపుతాం

గతంలో నిర్మించిన చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ భారీ వర్షాలకు తెగిపోయి నీరునిలువకపోవడం వాస్తవమే. పునర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఇదివరకే ఉన్నతాధికారులకు వివరించాం. చెక్‌డ్యాంలను పునర్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే చెక్‌డ్యాంలకు మరమ్మతు చేపడుతాం.

– విజయకుమార్‌రెడ్డి, ఆర్డీఎస్ ఈఈ

మరమ్మతు చేయాలి



పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం కట్టడాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. 2009లో కురిసిన భారీ వర్షాలకు సైడ్‌వాల్స్ కొట్టుకుపోయాయి. అప్పటినుంచి వాగులో చుక్కనీరు నిలువడంలేదు. పక్షులకు నీరు లేక అల్లాడుతున్నాయి. వెంటనే చెక్‌డ్యాంకు మరమ్మతు చేయాలి.

– సత్యన్న, అయిజ

బోరుబావులు ఎండిపోయాయి



పెద్దవాగులో చెక్‌డ్యాంలు తెగడం వాగులో నీరు నిలువ ఉండటం లేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పడిపోయి బోరుబావులన్నీ వట్టిపోయాయి. దానితో అయిజ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రమయ్యింది. చెక్‌డ్యాంలను పునర్ నిర్మిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి.

– శ్రీనివాసులు, అయిజ

ఏళ్లు గడుస్తున్నా..



చెక్‌డ్యాంలు తెగిపోయి సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు మరమ్మతు చేయలేదు. సైడ్‌వాల్స్ మరమ్మతు చేస్తే సరిపోతుంది. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతు చేయించాలి.

– రాజు, ఎక్లాస్‌పురం

పాపన్న ఆశయాలు సాధిద్దాం



కేటీదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆర్ఐ సిబ్బంది



మల్దకల్‌లో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కేటీదొడ్డి: బహుజనుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిలిచాడని ఆర్ఐ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి ఆర్ఎఐ పూలమాల వేసి నివాళులర్పించారు. పాపన్న చేసిన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతి, వెంకటేష్ నాయుడు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తహసీల్దార్ జోసి శ్రీనివాస్ శర్మ అన్నారు. ఆదివారం పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజోళి, వడ్డేపల్లి గౌడ సంఘవ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గౌడ సంఘం నాయకులు లక్ష్మన్ కుమార్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కిష్టన్నగౌడ్, వీరన్నగౌడ్, ఆంజనేయులు గౌడ్, ఓబులేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, ధర్మేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తేనే రానున్న రోజుల్లో విద్యార్థులకు చదువు అందుతుందని విద్యార్థులు అన్నారు. ఆదివారం కొత్త రాజోళిలోని పురవీధుల గుండా జూనియర్ కాలేజీ ఏర్పాటుకు విద్యార్థులు ర్యాలీ తీశారు. మండలంలో కాలేజీ లేక ఎంతో మంది విద్యార్థులు చదువును మధ్యలో ఆపేసి, మెకానిక్‌లుగా, కూలీలుగా మారుతున్నారని, రాజోళిలో ఇంటర్ కాలేజీ ఏర్పాటు చేస్తే వందలాది మంది విద్యార్థులు ఉన్నత చదువుతు చదువుతారని అన్నారు. ప్లకార్డులు పట్టుకుని కాలేజీ ఏర్పాటు చేయాలని నినదించారు. కార్యక్రమంలో కాలేజీ సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య, అడ్వకేట్ మాదన్న, రాజేష్, లక్ష్మి, రత్నమ్మ, డేవిడ్, సుమంత్ నిత్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండె నొప్పికి ఉపశమనం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాలలో పోలీస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాలు, గుండెనొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్ ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం గుండెనొప్పితో చాలమంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువలన గుండెనొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్, ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాతులను వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించడంతో సరైన చికిత్స అందడంతో వారు బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు సెఫ్టీ డీఎస్పీ చంద్రభాను, ఇన్‌చార్జీ ఎస్ఐ కేటీ మల్లేష్, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు విడుదల చేస్తున్న మంగమ్మ

అమరచింత: పట్టణంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు నెల రోజుల పాటు జరిగే కార్యక్రమం అన్ని వార్డుల్లో నిర్వహిస్తూ 18ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనాలని కరపత్రాల ద్వార ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, వైస్‌చైర్మన్ జీఎస్ గోపి పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం



గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ వరంగా మారిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మల్దకల్, కేటీదొడ్డి మండలాలకు చెందిన పలువురు లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఈరన్న, శివరామిరెడ్డి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక



అయిజ: అలంపూర్ నియోజకవర్గం బీఎస్పీ ఇన్‌చార్జి మధుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మండల కమిటీ, మున్సిపాలిటీ కమిటీలను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తిమ్మరాజు గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాజును ఎన్నుకున్నారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని నూతన అధ్యక్షులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్‌కుమార్, గద్వాల జిల్లా అధ్యక్షుడు కేశవ్‌లు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, రాజారత్నం, హనుమన్న, చిన్న, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అయిజ: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ధ్యాన మాస్టర్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనరసింహ మద్దిలేటి స్వామి ఆలయంలో ధ్యానంపై అవగాహన, భగవద్గీత ఆత్మ జ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. శ్వాస మీద ధ్యాసయే ధ్యానం అని వివరించారు. ఎవరి వయసు ఎంత ఉందో అన్ని నిమిషాలు ధ్యానం చేయాలని సూచించారు. ప్రతి రోజు ధ్యానం చేయడం ద్వారా రుగ్మతలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



అలంపూర్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ అశోక్ కుమార్

అలంపూర్: మండలంలో పది తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈఓ అశోక్ కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కేంద్రాల్లో విద్యార్థులకు కావల్సిన అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్ కేంద్రంలో 156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీహెచ్ఎస్ హరిజనవాడ పాఠశాలలో 210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇటిక్యాల మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రాజు తెలిపారు. ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు, కోదండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 134 మంది విద్యార్థులు, కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 144 మంది విద్యార్థులు, ఎర్రవల్లి చౌరస్తాలోని 10వ బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 128 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాలకు ఇన్విజిలేటర్లను, సూపరింటెండెంట్లను, అధికారులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

శాంతినగర్: నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి నరసింహ తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో మూడు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శాంతినగర్‌లో 270 మంది, రవీంద్ర ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 170 మంది, రాఘవేంద్ర పాఠశాలలో 290 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. 41 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు ముఖ్య సూపరింటెండెంట్‌లు, నలుగురు డిపార్ట్‌మెంటల్ అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వివరించారు.

గట్టు: నేటి నుంచే ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 12 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు మూడు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి వార్షిక పరీక్షలను రాయనున్నారు. మొత్తం 498 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

బాలగోపాల్ రెడ్డి సేవలు మరిచిపోలేం



మాట్లాడుతున్న నాగర్ దొడ్డి వెంకట్రాములు

గద్వాల అర్బన్: కార్మికుల కోసం దివంగత బాలగోపాల్ రెడ్డి చేసిన సేవలు మరిచిపోలేమని ఆ సంఘం నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో బాలగోపాల్ రెడ్డి సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల గోపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. నడిగడ్డలో 45 ఏళ్లపాటు కార్మికుల కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. అసంఘటిత రంగాల్లోని కార్మికుల సంక్షేమ కోసం, వారి సమస్యలపై చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. బాల గోపాల్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒ క్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయా, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు గద్దం కృష్ణారెడ్డి, అతికూర్ రహ్మాన్, వెంకటస్వామి, ఆంజనేయులు, అలూర్ ప్రకాష్ గౌడ్, మధుసూదన్ బాబు, గంజిపేట రాజు, పద్మాదేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నర్సింహ్మా, వాల్మీకి, జయ భారతి తదితరులు ఉన్నారు.

వంతెనకు మరమ్మతు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న యువకులు

అయిజ: మండల కేంద్రం నుంచి చిన్న తాండ్రపాడుకు ఏర్పాటు చేసిన రోడ్డుపై నిర్మించిన వంతెనకు మరమ్మతులు చేయాలని చిన్న తాండ్రపాడు యువకులు నిరసన తెలిపారు. ఆదివారం వంతెన వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వంతెన కూలి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఖగన్నాథ్ రెడ్డికి ఘన నివాళి



షేక్‌పల్లిల్లో మాజీ జెడ్పీటీసీకి నివాళులర్పిస్తున్న ఎంపీ రాములు

అలంపూర్/రాజోళి: ఇటిక్యాల మాజీ జెడ్పీటీసీ ఖగనాథ్ రెడ్డికి పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. గత నెల 23వ తేదీన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఇటిక్యాల మాజీ జెడ్పీటీసీ ఖగనాథ్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం మండలంలోని షేక్‌పల్లిలో ఏకాదశ దినకర్మ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎమ్మెల్యేలు వీఎం అబ్రహం, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కిషోర్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాజీ ఖగనాథ్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బల్గెరలో పోటీలను ప్రారంభిస్తున్న శ్యామల



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్ రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అలంపూర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ టెన్నిస్ క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఇందులో 22 టీమ్స్ పోటీలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు శేఖర్, శ్రీధర్, వినయ్, ఆరవింద్, ప్రవీణ్, మహ్మద్‌లు తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు గొందిమల్ల సర్పంచ్ వసుంధర పెద్దరెడ్డి, రెండో బహుమతి రూ.20 వేలు మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, చాంద్‌బాషా, మూడో బహుమతి మధు రూ.10 వేలు దాతలు ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, కౌన్సిలర్ సుదర్శన గౌడ్, దేవరాజ్ పాల్గొన్నారు.

గట్టు: క్రీడల్లో గెలుపోటములు సహజమని జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతులు అన్నారు. ఆదివారం బల్గెరలో దిగంబరస్వామి జాతర సందర్భంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ప్రతి జట్టు గెలుపు కోసం చివరి దాకా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, నాయకులు కిష్టప్ప, మద్దిలేటి, బాసు నాయుడు, రామకృష్ణ, బాసు గోపాల్, గట్టు సాయి, రమేష్, తిమ్మప్ప, రాజగోపాల్, సద్దాం, నాగరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలో ఆదివారం యూత్ సంఘం సభ్యులు క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకుడు కిశోర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి కోసం రూ. 50,116 అందజేశారు. కార్యక్రమంలో ఎలియాజర్, ఆనంద్, ప్రభాకర్, తిపన్న, నవీన్, శిఖమని, రాముడు, రాము, రాంకోటి, వీరేష్, జీవన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రెడ్డి సేవ సమితి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటరాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కోశాధికారి కొప్పుల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బండ్ల వెంకటేశ్వర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా శివప్రసాద్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డితో కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికై న కార్యవర్గానికి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఎంపిక చేసిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీతారామిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారు.